# పుత్రకామేష్టి

"నాకు అటువంటి వాటిమీద నమ్మకం లేదు!" అన్నది సోమిదేవి.

"తప్పు - చెంపలేసుకో! అటువంటి మాటలంటే పాపం వస్తుంది!" అన్నాడు యాజులు భయపడుతూ.

"మీరేమన్నా అనండి - మంత్రాలకు చింతకాయలు రాలవు."

యాజులు గబగబా చెంపలు వాయించుకున్నాడు.

"అపచారం - అపచారం" అన్నాడు.

"నువ్వలా దైవదూషణం చేస్తావు కనుకే నీకు పిల్లలు పుట్టలేదు! - అంతకన్నా వేరే కారణం ఏమీ లేదు. నేను చెప్పినట్టు విను. నిష్టగా నేను చెప్పింది చేయి. ఫలితం దక్కుతుంది!" అన్నాడు మళ్ళీ.

సోమిదేవి మాట్లాడలేదు.

"దేవుడి మీద నమ్మకాలు లేక దైవదూషణ చేయటం వల్లనే ఈ కలికాలంలో పాపం యిలా రాజ్యం చేస్తున్నది. అంతకన్నా ఏమీ కాదు."

సోమిదేవి యాజుల్ని ఒకసారి దీక్షగా చూసి తల వంచుకున్నది.

యాజులు సోమిదేవి ప్రక్కనే చేరి మెల్లగా అన్నాడు.

"కుంతీదేవికి పుత్రోదయం ఎలా జరిగిందో తెలుసా - సూర్యభగవానుడిని నిష్ఠగా ధ్యానించటం వల్ల. ఆ ధ్యానం, నిష్ఠ, నమ్మకం వుండాలేకానీ, ఏ కాలంలో నయినా దైవసహాయం వుంటుంది!"

"అది పురాణాలలోని కథ!" నెమ్మదిగా అన్నది భర్త మాటకు ఎదురు చెప్పలేని సోమిదేవి.

యాజులు మండిపడ్డాడు- "పురాణాలు అంటే ఏమిటి? అన్నీ జరిగినవే. ఎప్పుడో జరిగినవి కనుక తర్వాత తరాలవారికోసం పురాణాల రూపంలో అలా వున్నాయి."

కొంచెం ఆగి మళ్లీ అన్నాడు - "గాంధీగారు స్వాతంత్ర్యం కోసం పాటుపడటం నువ్వు చూశావా ? అసలు నువ్వప్పుడు పుట్టలేదు కదూ - కానీ నువ్వు నమ్మావ్ - ఎందుకు? పుస్తకాల్లో వున్నది కనుక అందరు అంటున్నారు కనుక! మరి అది పురాణం కాదా! అది కూడా కథేనా?"

సోమిదేవి తల ఎత్తలేదు.

యాజులు కొంచెం ఆగి నెమ్మదిగా అన్నాడు. - "నా సంగతి నీకు తెలుసు. నా పూజలూ, నిష్ఠ, దైవభక్తి ఈ నాలుగేళ్లుగా చూస్తున్నావు. నాలాటి భక్తుల్ని ఆ పరాత్పరుడు అన్యాయం చేయడు. నా మాట విని నేను చెప్పినట్టు ఈసారి చేయి. మూఢనమ్మకం అని కొట్టివేయకు. కనీసం నా పుణ్యఫలంగా నయినా మనకు పిల్లవాడు పుడతాడు."

సోమిదేవిది భర్తకు ఎదురుచెప్పే మనస్తత్వం కాదు. వయసులో చిన్నదే అయినా, సనాతుల కుటుంబంలోనించి వచ్చింది కనుక భర్త చెప్పిన దానికి తల వూపింది.

మర్నాడు భర్తతోపాటు 'కాకాని'కి బయల్దేరింది. ముందుగా యాజులు చెరువులో స్నానం చేశాడు. తర్వాత సోమిదేవి కూడా తల మీద స్నానం చేసింది. తర్వాత గుడిలోకివెళ్ళి దైవదర్శనం చేసుకున్నారు. యాజులు తనకు పుత్రోదయం కల్గించమని పరమశివుడ్ని భక్తితో ధ్యానించాడు. నిష్ఠగా ప్రార్థించాడు. తర్వాత గుడివెనక భాగానికి సోమిదేవితో సహా వచ్చాడు. అక్కడ కొంతమంది ముత్తయిదువులు, తడిబట్టలతో చేతులు చాపి దోసిల పట్టి, బోర్లాపడుకుని వున్నారు. సోమిదేవి కేమీ అర్థంకాలేదు.

యాజులు అన్నాడు - "తడిబట్టలతో యిలా దోసిలి చాపి బోర్లాపడుకోవాలి. భక్తి పారవశ్యంతో శివపార్వతులను ధ్యానించాలి. కొంచెం సేపటికి నిద్రలాగా మైకం కమ్ముతుంది. అప్పుడు శివపార్వతులు కలలో కనపడి ఆశీర్వదిస్తారు. దోసిలిలో అరటిపళ్ళు ప్రసాదంగా యిస్తారు. ఆ అరటిపళ్లు భుజిస్తే పిల్లలు కలుగుతారు. చూశావా వీళ్ళందరూ అలా చేస్తున్నవారే. ఆ పరాత్పరుడు తనను నమ్మిన వారిని చల్లగా చూస్తారు."

సోమిదేవికి అలా అక్కడ పడుకుని వున్నవారు దాదాపు పది మంది కనపడ్డారు. అది మూఢనమ్మకమని అనిపించినా కానీ, యాజులు చెప్పిన పద్ధతివల్లా, అక్కడ పది మంది ప్రత్యక్షంగా చేయటం వల్లా, అభ్యంతరం చెప్పలేదు ఆమె.

తనూ తడిబట్టలతో అక్కడ పడుకుంది. దోసిలిచాపి, బోర్లాపడుకుని, మనస్ఫూర్తిగానే

పరమేశ్వరుడిని జపించింది. యాజులు కొంచెం దూరంలో చెట్టు క్రింద కూర్చుని వినాయకుడి విగ్రహానికి పూజలు చేస్తున్నాడు.

అలా అరగంట గడిచింది.

ఎండి మండిపోతుంది.

సోమిదేవికి నిద్ర రావటం లేదు.

కల అసలే రావటం లేదు.

గంట గడిచింది.

ఎండలో సోమిదేవి శరీరం కాలిపోతున్నది.

ఆమెకు నడుం నొప్పి పుడుతున్నది, కళ్ళు మూతలు పడుతున్నాయి.

యింకో పావుగంట గడించింది.

యాజులు ముందుకువచ్చి చూశాడు.

సోమిదేవి శరీరం మీద తడిబట్టలు ఆరి పొడిబట్టలుగా తయారయాయి. ఎండ ఆమె శరీరం మీద మెరుస్తున్నది. ఆమె కళ్ళు మూసుకుని వున్నాయి.

"నిద్ర వచ్చేసింది. యిక ప్రసాదం వస్తుంది!" అనుకున్నాడు.

యింకో అరగంట గడిచింది.

సోమిదేవి కదలలేదు. అలాగే పడుకుని వుంది.

దగ్గరకువెళ్లి చూశాడు యాజులు. ఆమె కళ్ళు తేలవేసి వుంది.

అతనికి ఏదో గాభరా పుట్టింది. ఆమెను చేత్తో తట్టిలేపాడు. ఆమె శరీరం సలసలా కాలిపోతున్నది. నీరసంగా కళ్లు తెరిచింది.

"దేవుడు కనపడ్డాడా?" అడిగాడు యాజులు.

బలహీనంగా తల వూపింది సోమిదేవి.

ఆమెను జాగ్రత్తగా యింటికి తీసుకువెళ్లాడు యాజులు.

ఆరోజు నుంచీ సోమిదేవి మూసిన కన్ను తెరువలేదు.

న్యుమోనియా వచ్చిందో, టైఫాయిడ్ వచ్చిందో తెలీలేదు. యాజులు డాక్టరుకి చూపిస్తే కదా ఏ రోగమే తెలియటానికి.

"డాక్టరేమయినా దేవుడా ప్రాణం పోయటానికి!" అన్నాడు.

"ఏం జరగాలో అలా జరుగుతుంది" అన్నాడు.

శ్రీశైలం నుంచి తెప్పించిన విభూతి, మూడుపూటలా సోమదేవి నుదుటి మీద రాసేవాడు.

కాశీ నుంచి తెప్పించిన గంగాజలం రోజుకి మూడుసార్లు, మడికట్టుకుని తీర్థంలాగా యిచ్చేవాడు.

'దానిబదులు కాస్త విషం యివ్వకూడదూ. ఏ బాధ లేకుండా చచ్చిపోతాను కదా!'' అన్నది సోమిదేవి.

"మీ మూఢనమ్మకాలు ఈ జన్మకు పోవు. కనీసం నేనిలా చస్తే అయినా మీకు తెలిసివస్తుందేమో!'' అన్నది.

సోమిదేవి తరఫున, యాజులు చెంపలు వాయించుకున్నాడు. "ఎంత అపచారం మాటలు అంటున్నది!'' అనుకున్నాడు.

"భక్తిభావం, నిష్ట లేవు కనుకే కాకాని మల్లేశ్వరుడు నిన్ను కనికరించలేదు!'' అనుకున్నాడు.

కాసేపాగి "కలియుగం'' అని కూడా అనుకున్నాడు.

ఎలా అయితేనేం, నెల రోజులు నానా బాధపడి, చివరకు తేరుకున్నది సోమిదేవి.

"చూశావా - ఏ డాక్టరు మందిచ్చాడని నీకు తగ్గింది. ఇంకెప్పుడూ అలా అజ్ఞానంగా మాట్లాడకు!'' అన్నాడు మరింత విభూతి ఆమె నుదుటికి పూస్తూ.

ఆ రోజే శివాలయంలో అర్చన కూడా చేయించాడు.

తర్వాత పది రోజుల్లోనే, సోమిదేవి బాగా తేరుకుంది. పూర్తి ఆరోగ్యం వచ్చింది.

కొన్నాళ్ళ తర్వాత సోమిదేవితో అన్నాడు యాజులు- "మన వూరినుంచి ఒక బస్సు బయల్దేరుతుందిట. భారత దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలు- దక్షిణాన కన్యాకుమారి, రామేశ్వరం, ఉత్తరాదిన కాశీ, హరిద్వారం మొదలయిన పుణ్యక్షేత్రాలతో సహా అన్నీ చూపిస్తారుట. మొత్తం నాలుగు నెలలు దాకా వుంటుంది యాత్ర. మనిషికి రెండు వందల యాభై రూపాయలు టికెట్టు!''

"నాకు వెళ్ళాలని వుంది!'' అని కూడ అన్నాడు యాజులు.

"నేను ఒక్కదాన్నీ వుండలేను. నేనూ వస్తాను!'' అన్నది సోమిదేవి గోముగా.

"వస్తే బాగానే వుంటుంది. కానీ ఇద్దరికీ టిక్కెట్టే ఐదు వందలు అవుతుంది. ఇక పై ఖర్చో!'' కాసేపు దూలాల వేపు చూశాడు. ఏదో ఆలోచించాడు.

"వద్దులే, నేను వచ్చింతర్వాత యాత్ర విశేషాలన్నీ చెబుతాను. అప్పటి దాకా నువ్వు మీ అమ్మగారింట్లోనే వుండు-''లాలిస్తూ అన్నాడు యాజులు.

సోమిదేవి ఏనాడు యాజులు మాటకి ఎదురు చెప్పింది కనుక! అంగీకార సూచకంగా మౌనం పాటించింది.

యాజులు చెప్పింది నాలుగు నెలలే అయినా, అతను యాత్ర పూర్తి చేసుకుని వచ్చేసరికి దాదాపు ఐదు నెలలు అయింది. కానీ భారతదేశంలో వున్న చిన్నా, పెద్దా, అన్ని పుణ్యక్షేత్రాలూ తృప్తిగా దర్శించి వచ్చాడు. పుణ్యం సంగతేమొ కానీ, చాలా మూటల నిండా సోమిదేవి కోసం ఏవేవో పట్టుకొచ్చాడు.

సరాసరి అత్తగారింటికే వచ్చాడు.

"ఏం పడుకున్నావ్?" అని అడిగాడు గాభరాగా - మంచం మీద నీరసంగా, భారంగా పడుకుని వున్న సోమిదేవిని చూస్తూ.

"కూర్చోండి" అన్నది సోమిదేవి సిగ్గుపడుతూ.

యాజులు మంచం మీద కూర్చుని లాలనగా అడిగాడు. "ఏమిటి కథ?" అని.

సోమిదేవి యాజులు చెవిలో నెమ్మదిగా చెప్పి, సిగ్గుపడింది.

యాజులు చాలా సంతోషపడ్డాడు.

"అంతా నా యాత్రాఫలం?" అన్నాడు.

కాసేపాగి నెమ్మదిగా అడిగాడు "ఎన్నో నెల" అని.

సోమిదేవి మరింత సిగ్గుపడుతూ, మెల్లగా అంది - "మూడో నెల" అని.

"మూడో నెలా?" అదిరి పడ్డాడు యాజులు.

"అదేమిటి?" అన్నాడు కాసేపాగి.

"అబద్ధం!" అన్నాడు ఏదో ఆలోచించి.

"నిజమేనా?" అన్నాడు తేరుకుని.

"అవును" అన్నది సోమిదేవి నిర్మలంగా, నిండుగా.

"నేను వెళ్ళి ఐదు నెలలు అవలా ...." అనుమానంగా అన్నాడు యాజులు.

కానీ సోమిదేవి నిప్పులాంటిది. ఆమెను అనుమానించటం అనవసరం. "కూర్చుని తీరిగ్గా వినండి. జరిగింది చెబుతాను!" అన్నది సోమిదేవి.

"చెప్పు!" ఆతృత కనపరిచాడు యాజులు.

"మీరు వెళ్ళిన దాదాపు రెండు నెలల కనుకుంటాను - ఒకరోజు రాత్రి కూర్చుని రామాయణం చదువుతున్నాను. దశరథుడు తనకు పిల్లలు కలగలేదనే బాధతో వున్నాడు. అప్పుడు వశిష్టుల వారు సలహా ఇచ్చారు. పుత్రకామేష్టి యజ్ఞం చేస్తే పిల్లలు కలుగుతారని. దశరథుడు ఆయన సలహా పాటించి 'పుత్రకామేష్టి' యజ్ఞం చేశాడు. అగ్నిహోత్రం లోంచి, అగ్నిదేవుడు బయటకు వచ్చి, ఒక పాత్రలో పాయసం అందించాడు. అది త్రాగి దశరథుని ముగ్గురు భార్యలూ గర్భవతులయ్యారు. అది చదవగానే నా మనసంతా అదోలా అయింది. ఆ రోజు నిద్ర లేకుండా అదే కల, కలవరింత. ఆ రోజు కలలోనే, నాకు అగ్నిదేవుడు కనబడ్డాడు. ఒక పాత్రలో పాయసం తెచ్చి ఇచ్చాడు. నేను ఆ పాయసం త్రాగాను. అగ్ని అంతర్ధానమయిపోయాడు. నా కలా కరిగిపోయింది. కాని శరీరమంతా ఏదో బరువుగా, బడలికగా అనిపించింది. తర్వాత వాంతులవుతుంటే డాక్టరుగారు పరీక్ష చేసి, గర్భవతి నయానని చెప్పారు" ఆగింది సోమిదేవి.

"అంతా వట్టిది!" అనబోయాడు యాజులు.

"మీ భక్తి తత్పరతా, నిష్టా, యాత్రాఫలం, పుణ్యం - నాకు తోడ్పడ్డాయి. అవి వున్న వాళ్లకెప్పుడు దైవ సహాయం వుంటుంది!" భర్త కాళ్లకు నమస్కరించింది సోమిదేవి.

యాజులు బిత్తరపోయి చూశాడు సోమిదేవిని. *